# తస్మాత్ జాగ్రత!

**-ఎం.రాజరాజేశ్వరి**

విరామం లేకుండా మోగుతున్న కాలింగ్‌బెల్ చప్పుడికి మంచి నిద్రలోవున్న సుగాత్రి ఉలిక్కిపడి లేచి అంత కామన్‌సెన్స్ లేకుండా బెల్లు కొడుతున్నది ఎవరా? అని కిటికీలోనుండి తొంగి చూసింది.

తలుపుకి అవతల సుమారు పాతిక ముప్ఫయి ఏళ్ల మధ్య వున్న ఒక అమ్మాయి చాలా కంగారుగా నిలబడి అటూ ఇటూ దిక్కులు చూస్తూ ఏ క్షణాన లోపలికొద్దామా అని ఎదురు చూస్తోంది. ఆమె దృష్టి మాటిమాటికీ వీధి చివర నిలుస్తోంది.

సుగాత్రి 'ఎవరీమె? ఇంతవరకూ ఎక్కడా చూసిన గుర్తులేదు. ఎందుకంత కంగారు పడుతోంది? తలుపు తీస్తే చిక్కులు ఎదురుకావుకదా!' అని తటపటాయిస్తోంది. ఇంతలో బయటనుండి సుగాత్రిని చూడనే చూసింది ఆవిడ.

గత్యంతరంలేక ఏమయితే అవుతుందని సుగాత్రి తలుపుతీసి ఆవిడను లోపలకు రమ్మని పిలిచింది. ఆమె చటుక్కున లోపలికి ప్రవేశించి తలుపు గడియ పెట్టేసింది. సుగాత్రి బిత్తరపోయి చూడసాగింది ఆమెవైపు. అదేమీ పట్టించుకోని ఆమె తన చేతిలోని బ్యాగ్‌ని టీపాయ్ మీద పెట్టి కిటికీలో నుండి రోడ్డుమీదకు తొంగి చూడసాగింది.

ఆమె ప్రవర్తన వింతగా అనిపించి సుగాత్రి కూడా బయటకు చూడసాగింది. రెండునిముషాల తరువాత ఇద్దరు వ్యక్తులు ఆ వీధిలోకి ప్రవేశించి ఒక్కొక్క ఇంటి వైపు పరిశీలనగా చూసుకుంటూ నడవసాగారు. ఆమె కంగారుగా పక్కకి తప్పుకుని కిటికీ తలుపు మూసేసింది.

సుగాత్రి ఫ్రిజ్‌లోంచి ఒక గ్లాసుతో మంచి నీళ్లుతీసుకువచ్చింది. ఆమె గ్లాసు దించకుండా రెండు నిముషాల్లో ఖాళీ చేసేసి స్థిమితపడింది.

అప్పుడు సుగాత్రిని పరిశీలనగా చూసింది.

"చాలా థాంక్సండీ. నేనెవరో తెలియకపోయినా తలుపు తీసి ఆశ్రయం ఇచ్చారు. మీ మేలు మర్చిపోలేను" అంది.

"ఇంతకీ మీరెవరు? మీ పేరేమిటి? ఎందుకిలా కంగారుపడ్డారు? మిమ్మల్ని వెంటాడిన ఇద్దరు వ్యక్తులు ఎవరు?"

సుగాత్రి ప్రశ్నల మీద ప్రశ్నలు వరుసుగా సంధించడంతో ఆమె ఒక్కక్షణం బరువుగా ఊపిరి పీల్చుకుని వదిలింది.

"నా పేరు వసుధ. నేను డిగ్రీవరకు చదివాను. ఏదైనా ఉద్యోగం చేసుకుని నా కాళ్లమీద నేను నిలబడాలనే ప్రయత్నంలో వున్నాను. అయితే మా పిన్ని అంటే మా నాన్నకు రెండవ భార్య తమ్ముడు రంగారావు. నాకు మామయ్య వరుస అవుతాడు. వాడు కూడా మా ఇంట్లోనే వుంటాడు. వాడికి లేని వ్యసనాలులేవు. సకల గుణాభిరాముడు. ఎప్పటినుండో వాడికి నామీద కన్ను పడింది. నన్ను లొంగదీసుకోవాలని చాలా సార్లు విఫలయత్నం చేసాడు. నేను వాడి ఆటలు సాగనివ్వలేదు. మంధర లాంటి మా పిన్ని వాడికి చెడు ఆలోచనలు నూరిపోసింది. 'ఎలాగూ డిగ్రీ చదివింది. రేపో మాపో ఉద్యోగం చేస్తుంది. దాన్ని పెళ్లాడితే ఎప్పటికీ నాకు నువ్వే దిక్కంటూ నీ కాళ్ల దగ్గర పడుంటుంది' అని చెప్పడంతో వాడు రూటు మార్చి నన్ను పెళ్లాడమని వేధించసాగాడు. దానికి నేనేకాదు, మా నాన్న కూడా అస్సలు ఒప్పుకోలేదు. వీడి బారి నుండి తప్పించుకోవాలంటే ఎక్కడైనా ఉద్యోగం సంపాదించుకుని ఆ ఇంట్లో నుండి వెళ్లిపొమ్మని నాన్న సలహా ఇచ్చాడు.

ఆ సలహా మూలంగా నేను ఉద్యోం సంపాదించుకుంటే అది పసిగట్టిన ఆ దుర్మార్గుడు ఆర్డర్ కాగితం నాకందనీయక చింపేసి నేను వాడి చేతుల్లో నుండి జారి పోతున్నానని గ్రహించాడు.

ఎవరికో ఫోను చేసి రప్పించాడు. మా పిన్ని, ఆవిడ తమ్ముడు కలసి కూరలు అమ్మినట్లుగా ఆ వచ్చిన వాడికి నన్ను యాభైవేలకు అమ్మేసారు. నేను నిద్రపోతున్నానని అనుకుని బిగ్గరగా జరగవలసినదంతా ముచ్చటించుకుంటున్నారు. వాడు నన్ను ముంబాయి తీసుకువెళ్లి అక్కడి వేశ్యాగృహంలో ఇంకెవరికో లాభానికి అమ్ముకుంటాడట. వాళ్ల మాటలు విన్న నేను ఏం చేయాలో అర్థం కాక వణికిపోయాను. ఎలాగో ధైర్యం తెచ్చుకుని గబగబా చేతికందిన బట్టలు, సర్టిఫికెట్లు పట్టుకుని వాళ్ల కంట పడకుండా ఇంట్లోంచి బయటపడ్డాను. గేటు చప్పుడికి మా పిన్ని నన్ను చూడనే చూసింది. పారిపోతున్నానని అరవడంతో అనుకోని ఈ సంఘటనకు తేరుకుని వాళ్లు నన్ననుసరించేసరికి రోడ్డెక్కేసాను. వాళ్ల చేతికి చిక్కకుండా సందులుగొందులు తిరిగి మీ ఇంటి తలుపు తట్టాను. మీరు దయతో నాకు ఆశ్రయమిచ్చారు" అందామె.

వసుధ కథ విన్న సుగాత్రి మనసు ఆమెపట్ల జాలితో నిండిపోయింది. సమయానికి తను తలుపు తీయబట్టి లోపలికివచ్చి తప్పించుకుంది. లేకుంటే అన్యాయంగా ఆ కిరాతకుల చేతుల్లో పడి తన జీవితాన్ని కోల్పోయేది.

ఆమె వచ్చి పది నిముషాలపైనే అయింది. ఆపద నుండి తప్పించుకున్నానన్న ధైర్యం వచ్చాక ఆమెకి ఆకలి గుర్తుకువచ్చి అడగడానికి మొహమాటపడి పరిసరాలు పరికించసాగింది.

ఆమె చూపులను అర్థం చేసుకున్న సుగాత్రి లేచి కిచెన్‌లోకి వెళ్లింది. ఫ్రిజ్‌లోంచి దోశల పిండి తీసి నాలుగు దోసెలు, చట్నీవేసి వసుధకి అందించింది.

ఆమె మొహమాట పడుతూనే టిఫిన్ ప్లేటందుకుని అవురావురుమంటూ తినసాగింది. సుగాత్రి కాఫీ కలుపుకుని పట్టుకొచ్చింది.

వసుధ ఛాయనఛాయ రంగుతో, వత్తుగా, లావుగా ఉన్న తలకట్టు, సన్నని నడుము, పొడ

వుకు తగ్గ లావుతో ఆకర్షణీయంగా ఉంది. చాలా సేపు పరుగులు పెట్టడంవల్ల ఆమె మొహం అల సటగా ఉంది.

కళ్లు నిద్రని ఆహ్వానిస్తున్నాయి.

"ఒకసారి టాయ్‌లెట్ వాడుకోవచ్చాండీ" అంది మొహమాటంగా చూస్తూ.

సుగాత్రి లేచి టాయ్‌లెట్ చూపించి సోపు, టవల్ కూడా అందించింది.

ఆమె ఫ్రెష్ అయి "మీ సహాయానికి చాలా థాంక్సండీ. నేనింక బయలుదేరుతాను" అంది చేతులు జోడిస్తూ.

సుగాత్రి ఏం చేయాలో అప్పటికే ఆలోచించి పెట్టుకుంది.

"నాకన్నా చిన్నదానివి కాబట్టి నిన్ను వసుధ అనే పిలుస్తాను. ఇప్పుడు ఇంత అర్జంటుగా ఎక్కడికి వెళతావు? నువ్వు బయటకెళితే ఆ రౌడీల కంట పడి దొరికిపోతావు. ఇంకా నీకోసం వెదుకుతూనే ఉంటారు. కాబట్టి రెండురోజులు ఎటూ కదలక ఇక్కడే ఉండు. ఆ తరువాత పరిస్థితులు కుదుటపడితే మీ నాన్నగారికి ఫోన్ చేయడమో, నీకు ఉద్యోగం దొరికిన ఊరికి కాంటాక్ట్ చేసి అపాయింట్‌మెంట్ వేరే కాపీ తీసుకోవడమో చేద్దువుగానీ. తొందరప[illegible] బయటకు వెళ్లకు. ఏం చేయాలో నిదానంగా ఆలోచించుకో"



వసుధకి ఆ సలహా నచ్చినా "నావలన మీకు ఇబ్బంది కలుగుతుందేమో?" అంది సందేహంగా.

"మావారు క్యాంపుకి వెళ్లారు. ఎల్లుండికిగానీ రారు. ప్రస్తుతానికి నేను ఒక్కదాన్నే ఉంటున్నాను. కాబట్టి భయ సందేహాలు లేకుండా నిశ్చింతగా ఉండవచ్చు. వసుధ మొహం విప్పారింది.

'అలాగేనండీ. నేను నిలదొక్కుకోవడానికి రెండు రోజులు కూడా అవసరంలేదు. రేపటికల్లా మా నాన్నకి ఫోన్ చేయడమో, నాకు జాబ్ వచ్చిన చోటికి వెళ్లడమో చేస్తాను'' అంది సంతోషంగా.

ఒకరినొకరు ఎప్పటినుండో తెలుసున్నట్లుగా ఇద్దరూ కబుర్లు చెప్పుకుని టీవీ చూసి భోజనం చేసారు. పది దాటేసరికి వసుధ నిద్ర వస్తున్నట్లు ఆవులించింది.

"ఇక పడుకుంటానండీ. బాగా నిద్ర వస్తోంది. మళ్లీ రేపు ఉదయం నుండీ నా జీవన పోరాటం మొదలు'' అంది.

సుగాత్రి ఆమెకు మంచం చూపించింది. "సరే బాగా అలసిపోయావు. కొత్త చోటుకదా. నీకేదైనా అవసరం అయితే మొహమాట పడక నన్ను లేపు'' అని తను కూడా నిద్రాదేవతని ఆశ్రయించింది.

★★★

"ఏమిటింత మొద్దు నిద్ర పట్టేసింది బాత్రూమ్‌కి కూడా మెలకువ రాకుండా'' అంటూ ఉలిక్కిపడి కళ్లు తెరిచింది సుగాత్రి.

పరిసరాలు తనకి పరిచితంకావు. తెలుపుబట్టల్లోవున్న వ్యక్తులు హడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. ఆమెకి మెలకువ రావడంతో "లేవొద్దు...పడుకోండి. మీవాళ్లని పిలుస్తాను'' అని బయటకు వెళ్లి ఈ వార్తను చేరేసింది ఒకామె.

సుగాత్రికి అయోమయంగా ఉంది. ఏమయింది తనకు? ఎక్కడుంది తను? వీళ్లంతా ఎవరు?' అనుకుంటూ తల తిప్పి గుమ్మంవైపు చూసింది. తన కజిన్ ఎసిపి రవికిరణ్, భర్త శ్రీహరి లోపలికి వస్తున్నారు.

తనకు స్పృహ రావడంతో వాళ్ల మొహంలో రిలీఫ్ కనబడింది.

"ఏమయింది నాకు? ఎక్కడున్నాను నేను?'' అంది సుగాత్రి లేవబోతూ.

"చావు తప్పి కన్ను లొట్టబోయింది. కాస్తుంటే కోమాలోకి వెళ్లేదానివి. నీకు బుద్ధుందా? ముక్కూ మొహం తెలియని వాళ్లని లోపలకు రానివ్వడమే కాకుండా నీ పుట్టింటి బంధువులా మేపి ఒక్కదానివీ వున్నప్పుడు ఆశ్రయమిస్తావా? ఏదో చెప్పి బయటకి పంపించక'' శ్రీహరి కోపంగా అరిచాడు సుగాత్రి మీద.

సడెన్‌గా గుర్తు తెచ్చుకున్న సుగాత్రి "అన్నట్లు వసుధ ఏదీ? వెళ్లిపోయిందా? అవునూ ఆ అమ్మాయి అణుకువగా, అందంగా ఉందికదా. నా తమ్ముడికి ఇచ్చి పెళ్లిచేసి పుట్టింటి బంధువుగా చేసుకోవాలనుకున్నాను'' అంది.

ఆమె మాటలువిన్న రవికిరణ్ గట్టిగా నవ్వాడు.

"మంచి ఉద్యోగంలో వున్న మన వేణుకేం ఖర్మ పెళ్లయిన ముదురు మొహాన్ని పెళ్లి చేసుకునేందుకు'' అన్నాడు.

ఆ మాటలకు అదిరిపడ్డ సుగాత్రి మంచంమీదనుంచి లేచి కూర్చుంది.

"ఏమిటీ... వసుధకు పెళ్లయిందా?'' అంటూ ఆశ్చర్యపోయింది.

"అంతగా ఆశ్చర్యపోకు. వాళ్ల గురించి చేదునిజాలు, నగ్నసత్యాలు విన్నాక అప్పుడెలాగూ ఆశ్చర్యపోక తప్పదు నీకు''

అతని మాటలు విన్న తరువాత సుగాత్రికి అర్థమయింది తనేదో పెద్ద ప్రమాదంలో ఇరుక్కుని అదృష్టవశాత్తు తప్పించుకుందని.

"నాకు తెలియకుండా ఏదో జరిగింది. ఏం జరిగిందో చెప్పన్నయ్యా... నా ఊహకు అందడడంలేదు'' అంది బెదరుగా.


"ఇక సస్పెన్స్‌లో పెట్టనులే. చెప్తాను వినండి'' అని అందరివైపు చూస్తూ కుర్చీలో కూర్చున్నాడు.

"మీ ఆయనది టూరింగ్ జాబ్ అని తెలుసుగా. ఇంట్లో నువ్వొక్కదానివే వుంటున్న సంగతి ఆ ముఠావాళ్లు పసిగట్టారు. అందుకే వాళ్ల పథకంలో భాగంగా వసుధ పేరుతో తను ఆపదలో వున్నట్లు, తనను రక్షించమన్నట్లు నీకు సినిమా కథ వినిపించేసరికి అది చెప్పినదంతా నిజమని నమ్మేసి నీ మరదలుగా కూడా ఊహించుకున్నావు. వసుధ అలియాస్ విజయలక్ష్మి వెనకాలే వచ్చినవారు ఆమె ఇంట్లో దూరి క్షేమంగా సెటిలవడం గమనించి వెనక్కి వెళ్లిపోయారు. డిగ్రీ చదివాను, ఉద్యోగం వచ్చింది అని చెప్పగానే ఆమె వయస్సుని కూడా పట్టించుకోకుండా గొప్పగా ఊహించుకుని మర్యా



## ఆకట్టుకుంటున్న బిందుమాధవి!

'ఆవకాయ్ బిర్యానీ' సినిమా ద్వారా పరిచయమైన బిందుమాధవి అచ్చతెలుగు అమ్మాయి. సినిమాలో ఆమె కనిపించిన తీరు చూసినవాళ్లు చాలా సంప్రదాయబద్ధమైన గెటప్పుల్లోనే ఈమె నటిస్తుంది అనుకుంటే పొరపాటే. తను రొమాంటిక్ గెటప్పులతో సైతం తెరపై నటిస్తానంటోంది. అందుకు నిరూపణగా అన్నట్టు ఈ సినిమా ప్రీమియర్ షోకి పాశ్చాత్య దుస్తులు ధరించి వచ్చి మరీ అందర్నీ ఆకట్టుకునే ప్రయత్నం చేయడంతో ఫిలిం నగర్ జనాలు ఆశ్చర్యపోతున్నారు.



దలు చేసేసావు. రాత్రి నువ్వు పడుకోగానే అంతవరకూ నిద్ర నటించిన విజయలక్ష్మి లేచి అలికిడి అయితే నువ్వు నిద్ర లేవకూడదని తనతో తెచ్చుకున్న మత్తుమందు నీకు స్ప్రే చేసేసింది. అయితే అప్పుడే శ్రీహరి నీకు ఫోన్ చేసాడు. ఫోన్ చప్పుడికి కంగారుపడ్డ ఆమె ఫోను రిసీవరు పక్కన పడేసి మోతాదుకి మించి మత్తుమందు జల్లేయడంతో నువ్వు అచేతన స్థితికి వెళ్లిపోయావు. నువ్వు ఫోనుకు రెస్పాన్స్ ఇవ్వకపోవడంతో శ్రీహరి నాకు ఫోన్ చేసి ఒకసారి సంగతేమిటో నన్ను కనుక్కోమన్నాడు. పెట్రోలింగ్‌లో వున్న నేను జీపు సందు చివర ఆపి ఇద్దరు కానిస్టేబుళ్ళను వెంటబెట్టుకుని మీ ఇంటికి వచ్చాను.

నువ్వు మత్తులో వున్నప్పుడు అది, దాని మొగుడికి, తండ్రికి ఫోన్ చేసి రప్పించింది. వాళ్ల పాపం పండి దోచుకోవాలనే తొందరలో వీధి తలుపు దగ్గరగా వేసి బీరువా తెరిచి నీ నగలు, చీరలు, వెండి సామాన్లు, డబ్బు, ఖరీదైన సామాన్లన్నీ మూట కట్టారు. ఆ వచ్చిన వాళ్లల్లో ఒకడికి కొత్త ఆలోచన వచ్చింది. 'దీనికి మెలకువ వచ్చిందంటే మధ్యాహ్నం నుండి దానితో కలిసున్న నిన్ను తేలిగ్గా గుర్తు పడుతుంది. పోలీసు ఎంక్వయిరీలో ఎవరికీ దొరక్కుండా ఉండాలంటే దీని పీక కోసి వెళ్లిపోదాం' అని కత్తి తీసి రెడీ అయ్యాడు. మీ ఇంట్లో లైట్లు వెలుగుతున్నాయి. ఫోను రెస్పాన్స్ లేదు. వీధి తలుపు తెరిచి ఉండడంతో ఇక ఆలస్యం చేయక లోపలకు దూసుకు వెళ్లాం. ఆ దొంగలు మమ్మల్ని చూసి పారిపోవాలని ప్రయత్నించారుగానీ చివరకు దొరికిపోయారు. పోలీసు మర్యాద జరిగేసరికి ఆడదొంగ జరిగినదంతా చెప్పింది. ఏమాటకామాటే చెప్పుకోవాలి. దాన్ని అన్ని దెబ్బలు కొట్టినా కూడా నిన్ను, నీ ఆతిధ్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయింది.''

సుగాత్రి మొహం పాలిపోయింది. జరిగిన సంగతి తెలుసుకుని చిగురుటాకులా వణికిపోయింది. ఒక్క నిముషం రవికిరణ్ రావడం ఆలస్యం అయితే ఆ దొంగలు తన గొంతు కోసి దారుణంగా హతమార్చేవారు. మాటల గారడీతో పగలు మత్తులు ముంచితే రాత్రి నిజం మత్తులో పడేసి తన ప్రాణాలకే ఎసరు పెట్టింది. జీవితంలో ముక్కూ మొహం తెలియని కొత్తవారికి ఆశ్రయం ఇవ్వకూడదు అని మనసులోనే చెప్పుకుంది.

"అన్నయ్యా! నీ కస్టడీలో వున్న వసుధ అదే ఆ విజయలక్ష్మిని ఒకసారి చూపిస్తావా?''

"ఎందుకూ... నీ తమ్ముడిని చేసుకొమ్మని నచ్చచెప్తావా?'' శ్రీహరి హాస్యమాడాడు.

రవికిరణ్ ఆమెతో "చాలా ఎక్కువ మోతాదులో మత్తుమందు పీల్చి రెండురోజులుగా స్పృహ లేకుండా ఉన్నావు. ఈ రోజు రెస్టు తీసుకో. రేపు తీసుకువెళతాలే'' అన్నాడు.

★★★

"వసుధా!'' అన్న పిలుపుకి లాకప్‌లో తలొంచుకుని కూర్చున్న విజయలక్ష్మి తలెత్తి చూసింది.

ఎదురుగా తననే తీవ్రంగా చూస్తున్న సుగాత్రి.


పెట్టుకున్న విగ్గు తీసివేయడంవల్ల పొట్టిజుట్టు, మూడురోజులుగా స్నానపానాదులు లేకపోవడంవల్ల మాసిన చీర, దెబ్బల తీవ్రతకు ఆమె మొహం ఉబ్బి చాలా అసహ్యంగా ఉంది. ఇటువంటి దాన్నా తాను నమ్మి ఇంట్లోకి రానిచ్చి ఆదరించింది?

"వసుధ అన్న పేరుతో నాటకమాడి కట్టు కథను వినిపించి అన్నం పెట్టిన చేతిని నరకాలనే చూసావు కదే. నీలాంటివారి మూలంగానే మనుష్యులంటే నమ్మకం పోతోంది. నిజంగా ఆపదలో వున్నవారు సహాయం చేయమని వేడుకున్నా వారిని అనుమానించి తరిమికొట్టే పరిస్థితి ఏర్పడుతోంది. ఛీ...ఏంటి ఒక బ్రతుకేనా? ఇలాంటి బ్రతుకు బ్రతికే బదులు చావరాదూ''

పోలీసులు కొట్టిన దెబ్బలకన్నా సుగాత్రి మాటలు విజయలక్ష్మికి చురకత్తుల్లా గుచ్చుకుని ఆమెవైపు చూడడానికి కూడా మొహం చెల్లక తలదించుకుంది.

"అర్ధమయిందా సుగాత్రి! నీలా ఒంటరిగా ఉన్నవారు కొత్తవారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఒకవేళ వారిని ఆదుకునే పరిస్థితి కలిగినా నీ పక్కవారికో లేక పోలీసు కంట్రోల్ రూమ్‌కో వారి గురించి చెబితే అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రక్షింపబడతారు. ఇకముందైనా ఆపదలు కొని తెచ్చుకోక జాగ్రత్తగా ఉండు'' అన్నాడు హెచ్చరికగా రవికిరణ్.

★



## పౌర్ణమి లేని నెల

ప్రతినెలా ఒకసారి పౌర్ణమి వస్తుంది. కానీ ఒకే ఒకసారి 1865 ఫిబ్రవరి నెలలో పౌర్ణమి రాలేదుట. ఇన్ని వేల సంవత్సరాలలో మరే సంవత్సరంలోనూ ఇలాంటిది జరగలేదని చరిత్ర చెబుతోంది.

-తటవర్తి

